# కరెంట్ కష్టాలు కావాలా.. సాగు సంబురం కావాలా..



తాళ్లధర్మారంలో మోకు ధరించిన జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్

- ఏది కావాలో మీరే నిర్ణయం తీసుకోండి
- నాడు ప్రతి ఇంటికి ఒక టార్చిలైట్ ఉంటుండె
- స్వరాష్ట్రంలో 24 గంటల కరెంట్ ఇస్తున్నం
- కాంగ్రెస్ వస్తే ఎవుసానికి మూడు గంటలే కరెంట్ పక్కా
- ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- జగిత్యాల అభ్యర్థి, డాక్టర్ సంజయ్ కుమార్
- సారంగాపూర్ మండలంలో ప్రచారం

సారంగాపూర్, నవంబర్ 21: 'నాటి కాంగ్రెస్ పాలన కరెంట్ కష్టాలు మళ్లీ కావాలా..? 24 గంటల ఉచిత కరెంట్‌తో పచ్చని పంటలతో కలిగే సాగు సంబురం కావాలా..? మీరే ఆలోచించుకోవాలని' జగిత్యాల అభ్యర్థి, డాక్టర్ సంజయ్ కుమార్ రైతులకు పిలుపునిచ్చారు. నాడు ప్రతి ఇంటికి ఒక టార్చి లైట్ ఉండేదని, ఎవరైనా మనకు తెల్సినవాళ్లు దుబాయ్, గల్ఫ్ దేశాల్లో ఉంటే ఒక లైట్ తెమ్మని చెప్పేదని, ఇప్పుడా సమస్య లేదని, 24గంటల కరెంట్ ఉంటున్నదని వివరించారు. మంగళవారం బీర్‌పూర్ మండలం తుంగూర్, కొల్వాయి, రేకులపల్లి, తాళ్ల ధర్మారం, కోమన్‌పల్లి, డోంకేశ్వరం, చిన్న కొల్వాయి గ్రామాల్లో లైబ్రరీ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ సాగుకు 24 గంటల కరెంట్ ఇస్తుంటే.. కాంగ్రెస్ ఎందుకని మాట్లాడుతున్నదని, మూడు గంటలే ఇస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ మాట్లాడుతున్నాడన్నారు. ఇంకా 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలని అంటున్నడని, ఆ మోటర్ వాళ్లు కొనిస్తరా..? చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాక ముందు కరెంట్ ఎట్లుండే..? ఇప్పుడెట్లుంది..? ఒకసారి ఆలోచించాలని సూచించారు. నాటికీ నేటికి తేడాను గమనించాలని కోరారు. నిరంతర కరెంట్‌తో ఏ ఊళ్లో ఎటు చూసినా పంటపొలాలే కనిపిస్తున్నాయని, పుట్లకొద్ది ధాన్యం పండుతున్నదని, ఇదంతా సీఎం కేసీఆర్ కృషికి ఫలితమన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో విద్య వైద్యం, వ్యవసాయ రంగాల్లో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. జిల్లా కేంద్రంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి, నిరుపేదలకు అందించామన్నారు. రాబోయే రోజుల్లో గ్రామాల్లోనూ డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఇంకా రైతుబీమా తరహాలోనే ప్రతి పేద వ్యక్తికి రూ.5లక్షల ఉచిత బీమా చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతున్నదని, పేదల, రైతుల, మహిళల పక్షపాతి ప్రభుత్వంగా బీఆర్‌ఎస్ పేరుగాంచిందన్నారు. తానొక్కటే చెబుతున్నానని, కాంగ్రెస్ మాటలు నమ్మితే మోసపోతారని, రాష్ట్రం అంధకారమవుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో 44లక్షల మందికి రైతు బీమా కల్పించామని, రైతుల మాదిరే రాష్ట్రంలో ఉన్న 50లక్షల మంది పేదలకు రూ.5లక్షల బీమా కల్పిస్తామన్నారు. ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు పింఛన్ ఇస్తున్నామని, కొత్తగా మహిళలందరికీ సౌభాగ్యలక్ష్మీ పథకం ద్వారా నెలకు రూ.3వేల పింఛన్ ఇస్తామన్నారు. రెండు సార్లు మంత్రిగా పనిచేసిన జీవన్ రెడ్డి సారంగాపూర్ మండల అభివృద్ధిని గాలికొదిలేసిండని, కనీసం రోళ్లవాగులో తట్టెడు మట్టితీసిన పాపాన పోలేదన్నారు. స్వరాష్ట్రంలో రూ.136కోట్లతో రోళ్లవాగు ప్రాజెక్ట్‌ను ఆధునీకరించామని, 99శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన ఒక్క శాతం కూడా అటవీ అనుమతుల కారణంగా ఆలస్యమవుతున్నదని వివరించారు. అటవీ అనుమతులు కేంద్రం పరిధిలో ఉంటాయని, బీజేపీ నాయకులు ఎందుకు పట్టించుకోవడం లేదో ప్రశ్నించాలన్నారు. 2004 నుంచి 2014 దాకా పదేండ్లు కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ బీర్‌పూర్ మండలంలోని ఒక్క చెరువును బాగు చేయలేదని, బీఆర్‌ఎస్ వచ్చాకనే చెరువులకు పూర్వవైభవం తెచ్చినట్లు చెప్పారు. ప్రతి గ్రామానికి రోడ్లు వేశామన్నారు. తుంగూర్‌కు మంజూరైన దంత వైద్యశాలకు స్థలం లేక వేరే వద్ద నడుస్తున్నదని, ఎవరైనా దాతలు దవాఖానకు స్థలం ఇస్తే దానిని బీర్‌పూర్ మండలంలో ఏర్పాటు చేస్తామన్నారు. 'నేను మీ బిడ్డను. నిరంతరం మీ మధ్యలోనే ఉంటా. మరోసారి ఆశీర్వదిస్తే.. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని' ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 30న కారు గుర్తుకు ఓటేసి భారీ మోజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు మహిళలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. సన్మానించారు. బైక్ ర్యాలీలు నిర్వహించారు. పాటల సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, ఆర్బీఎస్ జిల్లా సభ్యుడు కొల్ముల రమణ, పార్టీ అధ్యక్షుడు నారపాక రమేశ్, ప్రధాన కార్యదర్శి శీలం రమేశ్, ఉపాధ్యక్షులు జక్కినపెల్లి శ్రీనివాస్ రావు, రామకిష్టు గంగాధర్, ఆర్బీఎస్ మండల కన్వీనర్ మెరుగు రాజేశం, స్థానిక ప్రజాప్రతినిధులు మేసు ఏసుదాసు, ఎలగందుల లక్ష్మి, నల్లమైపాల్ రెడ్డి, నారపాక రమ, రవీందర్, రమేశ్, గర్వకుర్తి శిల్ప-రమేశ్, రిక్కల ప్రభాకర్, ఎడ్ల సృజన, భీమక్క, పర్వతం రమేశ్, అజ్మీర ప్రభాకర్, బోడ స్వప్న, చిక్రం సుగుణ, బందెల మరియా, చుంచు శారద, అజయ్ పాల్గొన్నారు.

# నేను మీ బిడ్డను

కోటిలింగాల పద్మశాలీలకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్



- ఆశీర్వదించండి.. అండగా ఉంటా
- బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- కోటిలింగాలలో ప్రజా ఆశీర్వాద యాత్ర

వెల్గటూర్, నవంబర్ 21: 'నేను మీ బిడ్డను. ఎన్నో ఏండ్ల నుంచి మీ సేవలోనే ఉన్నా. మీకు ఆపదొస్తే ఆదుకుంటా. కష్టమొస్తే తోడుగా నిలుస్తానని' ధర్మపురి బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంతి కొప్పుల ఈశ్వర్ ప్రజలకు భరోసానిచ్చారు. మంగళవారం వెల్గటూర్ మండలం కోటిలింగాలలో ప్రజా ఆశీర్వాద యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా తమ గ్రామానికి వచ్చిన అమాత్యుడికి మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్ మాట్లాడారు. కోటిలింగాలలో మిగిలిన పనులన్నీ చేస్తానని, సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. ప్రజలకు తనకు మధ్య దాపరికాలు ఉండవద్దని, మధ్యవర్తులు, పైరవీలకు తావు లేకుండా నేరుగా తనకు ఫోన్ చేసి మీ సమస్యలు చెప్పాలని సూచించారు. మిమ్మల్ని తనకు దూరం చేయడంలో కొన్ని శక్తులు అడ్డుపడ్డాయని, అలాంటి వారిని దూరం పెట్టి నేరుగా తననే సంప్రదించాలని సూచించారు. మరొకసారి ఆశీర్వదించాలని, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఈ సందర్భంగా కోటిలింగాల అర్చకుడు సంజీవ్ శర్మ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 100 మంది పద్మశాలి నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా, కండువా కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దాసరి సత్తయ్య, దాసరి భరత్, పరుష రమేశ్, దాసరి కోటయ్య, రమేశ్, రాజ్‌కుమార్, ఎలగం గంగయ్య, ఎలుగం మల్లేశం, రాజ్‌కుమార్, చింతకింది రాజేశ్, మహేశ్, శంకరయ్య, అడగంట్ల తిరుపతి, రాజయ్య, నక్క రాయలింగు, జోగు రాజయ్య, ఎన్నం ఆశయ్య, రాపాక గంగయ్య, కోటయ్య, రామయ్య, రాపాక కోటయ్య, దాసరి శ్రీనివాస్ ఉన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు పర్ష కోటయ్య, ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, సర్పంచ్ నక్క మౌనిక-రవితేజ, బోడకుంటి రమేశ్, ఎంపీటీసీ రాజేశ్వరి ఉన్నారు.

# కాంగ్రెస్, బీజేపీ రెండూ రెండే



మెట్‌పల్లి : మాట్లాడుతున్న కోరుట్ల అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్, పక్కన ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

- వాళ్లవన్నీ ఝూటా మాటలే
- నమ్మితే మునుగుతరు
- స్థానికుడు కావాలా.. స్థానికేతరుడు కావాలా..
- ఆలోచించుకోండి
- అభివృద్ధి, సంక్షేమానికే ఓటేయండి
- కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- మెట్‌పల్లి పట్టణంలో రోడ్‌షో

మారుతీనగర్, నవంబర్ 21: 'కాంగ్రెస్, బీజేపీలు రెండూ రెండే. వారి పాలన దరిద్రం. ఏండ్ల కొద్దీ పాలించి కాంగ్రెస్ చేసిందేమీ లేదు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో ఒరిగిందేమీ లేదు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అన్నీ అబద్ధాలు చెబుతున్నరు. ఫేక్ హామీలిస్తున్నరు. నమ్మితే మునుగుతరని.. జాగ్రత్త అని' కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రజలకు సూచించారు. మంగళవారం మెట్‌పల్లి పట్టణంలోని పలువార్డుల్లో రోడ్ షో నిర్వహించి చావిడి, బస్‌డిపో, గోల్ హనుమాన్ చౌరస్తాల వద్ద కార్నర్ మీటింగ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డుల కౌన్సిలర్లు సంజయ్ కల్వకుంట్లతో పాటు ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావును సత్కరించారు. ఈ సందర్భంగా సంజయ్ కల్వకుంట్ల మాట్లాడారు. ఎన్నికలు వచ్చినయంటే చాలు కాంగ్రెస్, బీజేపీ వాళ్లు వచ్చి, మాయ మాటలు చెప్పి మోసం చేస్తారని వారిని నమ్మద్దని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం, ఆడబిడ్డలకు చేసిన మేలును చూసి ఆలోచించి ఓటేయాలని కోరారు. 'మీకు స్థానికంగా ఉండే నేను కావాలా..? హైదరాబాద్, నిజమాబాద్‌లో ఉండే స్థానికేతరులు కావాలా..? ఆలోచించుకోవాలని' సూచించారు. బీజేపీ నాయకుడు ఎంపీగా గెలిచిన ఐదేండ్లలో నియోజకవర్గానికి చేసిందేమీ లేదని, కులాల, మతాల పేరుతో ఐకమత్యంగా ఉన్న వారిలో చిచ్చు పెడుతూ స్వార్థరాజకీయాలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌కు 11 సార్లు అవకాశం ఇస్తే తెలంగాణ ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. రైతులను ఏనాడూ పట్టించుకోని ఆ పార్టీ, ఏ మొఖం పెట్టుకొని ఇప్పుడు ఓట్లు అడుగుతున్నదని ప్రశ్నించారు. మహిళల కోసం బీఆర్‌ఎస్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, బీడీ కార్మికులకు ఎలాంటి కటాఫ్ డేట్ లేకుండా పింఛన్ అందజేస్తామని చెప్పారు. తన తండ్రి పట్టణానికి చేసిన అభివృద్ధిని చూసి తనను ఆశీర్వదిస్తే అండగా ఉండి సేవలందిస్తానని, ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, మున్సిపల్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రావు పాల్గొన్నారు.

**అభివృద్ధి అంటే తెలియని ప్రతిపక్షాలు:**

**ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు**

అభివృద్ధి, సంక్షేమంలో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కొనియాడారు. అభివృద్ధి అంటే తెలియని కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయ మాటలు నమ్మితే మోసపోతరని, నాటి రోజులు గుర్తు చేసుకోవాలని సూచించారు. స్వరాష్ట్రంలో పేదలకు అండగా నిలిచిన సీఎం కేసీఆర్‌కు మరోసారి మద్దతు పలుకాలని, పనిచేసే ప్రభుత్వానికే అవకాశం ఇవ్వాలని కోరారు. తనను ఆదరించినట్లుగానే తన కుమారుడిని ఆదరించి కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# స్థానికేతరుడు కావాలా..? స్థానికుడు కావాలా..

- మీరే ఆలోచించుకోవాలి
- నేను మీ బిడ్డను.. ఆశీర్వదించండి
- చొప్పదండి అభ్యర్థి సుంకె రవిశంకర్
- కొడిమ్యాలలో ప్రచారం



కొడిమ్యాలలో మాట్లాడుతున్న చొప్పదండి అభ్యర్థి, ఎమ్మెల్యే రవిశంకర్

కొడిమ్యాల, నవంబర్ 21: 'నేను మీ బిడ్డను. ఇక్కడే ఉంటా. మీ కోసమే పనిచేస్తా. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు నాన్‌లోకల్. ఐదేండ్లకోసారి కనిపిస్తరు. నేనొక్కటే అడుగుతున్నా. మీకు స్థానికేతరుడు కావాలా..? మీ మధ్యే ఉండే స్థానికుడు కావాలా..? ఆలోచించుకోవాలని' చొప్పదండి అభ్యర్థి సుంకె రవిశంకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం గోపాల్‌రావుపేట, అప్పారావుపేట, సంద్రల్లపల్లి, తిర్మలాపూర్, కోనాపూర్, దమ్మయ్యపేట, సూరంపేట, గంగారాంతాండ, కొడిమ్యాల, పూడూర్‌లో ప్రచారం చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కనిపిస్తారని, వాళ్లు మహానటులు అని, నమ్మితే మోసపోతారన్నారు. స్థానికులకే ఇక్కడి సమస్యలు తెలుస్తాయన్నారు. కాంగ్రెస్ 60 ఏండ్ల పాలనలో తెలంగాణకు చేసిందేమీ లేదని, 24 గంటల కరెంట్, రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, ఆసరా పింఛన్లు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని, వచ్చే ఏడాది నుంచి ఆసరా పింఛన్ రూ.5వేలకు పెంచుతామని, రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం ఇస్తామని, పేదింటి మహిళలకు నెలకు రూ.3వేల జీవనభృతి అందజేస్తామన్నారు. ఇంకా 400కే సిలిండర్ అందించనున్నట్లు చెప్పారు. కేసీఆర్ నాయకత్వమే రాష్టానికి శ్రీరామ రక్ష అన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఈ ఎనిమిది రోజులు శక్తి వంచన లేకుండా పనిచేయాలని, ఇంటింటికీ వెళ్లి మ్యానిఫెస్టోను వివరించాలన్నారు. కాగా, మండలంలోని సంద్రల్లపల్లి గ్రామానికి చెందిన 20 మంది యువకులు వివిధ పార్టీలకు రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ సైతం బీఆర్‌ఎస్‌లో చేరగా, కండువా కప్పి ఆహ్వానించారు. ఇక్కడ ఎంపీపీ మేన్నేని స్వర్ణలత, జడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి ఉన్నారు.